క్లుప్తంగా

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ధరణి

ఉయ్యాలవాడ: మిరప సాగుచేసిన రైతులు తప్పని సరిగా యాజమాన్య పద్ధతులను పాటిస్తే తెగుళ్లను నివారించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి ధరణి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అల్లూరు, మాయలూరు, ఎస్. కొత్తపల్లె గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మరపలో ఆకుముడత, తామర వంటి తెగుళ్లు ఆశించినట్లు గుర్తించామన్నారు. ఇందుకు నివారణలో భాగంగా పంటలో మొక్కల మధ్య బంతిపూలను నాటుకోవాలని సూచించారు. లీటరు ట్రైకోడెర్మా, ఒక లీటరు సుడోమోనాస్ కలిపి పంటకు చల్లుకోవాలి. అలాగే పొటాషియం నైట్రేట్ కూడా వేసుకోవాలని చెప్పారు.

ధ్యానంతో మనశ్శాంతి



రాజనగరంలో పిరమిడ్‌ను ప్రారంభిస్తున్న ప్రబోత్ అచ్యుత

శిరివెళ్ల: నిరంతర ధ్యానంతో మహాబలం, మనశ్శాంతి కలుగుతుందని హైదరాబాద్‌కు చెందిన ధ్యాన ప్రబోత్ అచ్యుత అన్నారు. బుధవారం రాజనగరంలో పిరమిడ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానుషులు ఎన్నో సమస్యలతో నిత్యం సతమతమవుతూ.. చివరకు మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ధ్యానంపై మనస్సు నిలిపితే సమస్య రోగాలు, సమస్యలు తీరిపోతాయన్నాయన్నారు. ప్రతి ఒక్కరు తమ తీరిక సమయంలో 45 రోజుల పాటు ధ్యానం చేస్తే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పిరమిడ్ స్థల దాత అంజయ్య, గుంప్రమాన్‌దిన్నె గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, ఉశేనిరెడ్డి పాల్గొన్నారు.

వారబందీ పద్ధతిలో నీటి విడుదల



కాల్వలో పారుతున్న సాగునీరు

రుద్రవరం: వీబీఆర్ నుంచి తెలుగగంగ కాల్వకు నీటిని విడుదల చేసినట్లు ఆ శాఖ ఈఈ శంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలకు తెలుగుగంగ కాల్వల ద్వారా వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే నాల్గోవిడత వెలుగోడు బ్యాలెన్సింగ్ నుంచి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, ఆనీటిని వృథా చేయకుండా రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటాలు సాగిస్తామని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి, రాష్ట్ర నాయకులు వాడాల నాగరాజు తెలిపారు. గురువారం గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రజకుల ఆత్మగౌరవ సభకు లక్షలాదిగా రజకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం రజక ఆత్మగౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అనాదిగా కులవృత్తులతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న రజకుల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నందవరం శ్రీనివాసులు, కె.మధు, వెంకటేష్, శీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఆళ్లగడ్డ : పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ప్రొద్దుటూరుకు చెందిన చైతన్య మరో నలుగురితో కలిసి మహనంది క్షేత్రానికి వెళ్లి దర్శనం చేసుకుని కారులో తిరిగి ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆళ్లగడ్డ సమీపంలోని జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొట్టడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చైతన్యతో పాటు కారులో ఉన్న నలుగురు గాయపడగా ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు.

పంట కోతలు..జాగ్రత్తలు పాటిస్తే మేలు

- చేతికొస్తున్న ఖరీఫ్ పంటలు
- మంచు ఆరిన తర్వాతే కోతలు ప్రారంభించాలి
- అనుకూల వాతావరణంలో నిల్వ ఉంచడం ముఖ్యం
- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు సూచనలు



రామకృష్ణారావు



మిరప గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం



గడివేముల మండలం చిందుకూరు వద్ద మొక్కజొన్న కోత దృశ్యం

నంద్యాల(సెంట్రల్): పంట కోతల సమయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి. ఆరుగాలం కష్టించి పండించటం ఒకెత్తయితే, చేతికందిన దిగుబడుల్ని జాగ్రత్తగా అమ్ముకొని మంచి ధర పొందడం ముఖ్యం. జిల్లాలో వర్షాకాలంలో సాగు చేసిన పంటల కోతలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పంట నూర్పిడి చేయడంతో పాటు నిల్వలో సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే గిట్టుబాటు ధర పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు తెలిపారు. జిల్లాలో సాగయ్యే సోయా, మిరప, మొక్కజొన్న పంట కోతల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు.

కోత సమయంలో మందులు పిచికారీ చేయరాదు..
మిరప పంట కోతల సమయంలో ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదు. ఉత్పత్తుల్ని తేమలేని గోనె సంచుల్లోనే నింపుకోవాలి. నిల్వ చేసే ప్రాంతంలో తేమ లేకుండా చూసుకోవాలి. కాయల్ని పూర్తిగా చేనుపైనే పండనివ్వకూడదు. దీనివల్ల నాణ్యత తగ్గుతుంది. సోయా, మొక్కజొన్న ఆరబోసే, నిల్వ చేసే ప్రదేశాల్లో ఎలుకలు, పందికొక్కులు లాంటివి రాకుండా జాగ్రత్త వహించాలి. దిగుబడుల్ని ఎండబెట్టడానికి ముందే అందులో ఉన్న చెత్త, దుమ్ము ధూళిని వేరు చేయాలి. ఆరబోసేటప్పుడు పల్చగా పోయాలి. తద్వారా తొందరగా ఎండి, పట్టాల ఖర్చులు తగ్గుతాయి. ఆరబోసిన తర్వాత రోజుకు కనీసం నాలుగుసార్లు దున్నాలి. లేదా రోజుకు కనీసం ఒకసారి తిరగబోయాలి. దీంతో అడుగున ఉన్న గింజలు పైకి వచ్చి సమానంగా ఆరుతాయి. తేమ శాతం కూడా త్వరితగతిన తగ్గుతుంది. మంచు ఆరిన తర్వాతే పంట కోయాలి. మంచు ఉన్న సమయంలో కోస్తే గింజలు మెత్తబడి నలుపు రంగులో మారుతాయి. యంత్రాలతో కోసేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి. యంత్రం వెనుకకు వచ్చేటప్పుడు చూసుకోకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

మిరప..
పంట దిగుబడి అధికంగా పొందడానికి కాయల్ని ఎప్పటికప్పుడు కోసి, పట్టాలపై లేదా సిమెంట్ కళ్లాలపై ఆరబెట్టాలి. వర్షాధారపు పైరుకు మూడు, నాలుగు కోతలు, నీటి ఆధారం అయితే 6-8 కోతలు కోయొచ్చు. అంతకంటే ఎక్కువగా పండితే నాణ్యత తగ్గుతుంది. రాత్రిళ్లు మంచుబారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి. మిరపలో 10 శాతానికి మించి ఎక్కువ తేమ ఉండకుండా ఎండబెట్టాలి. తాలు కాయలు, మచ్చకాయలను గ్రేడింగ్ చేసి వేరుచేయాలి. శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నిల్వ చేయాలి. తేమ తగలకుండా వరిపొట్టు లేదా చెక్క బల్లల మీద గోడలకు 50 సెం.మీ దూరంలో నిల్వ ఉంచాలి. అవకాశం ఉంటే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తే రంగు, నాణ్యత తగ్గకుండా లాభదాయకంగా ఉంటుంది.

సోయా..
సోయా, మొక్కజొన్న పంటలను ప్రస్తుతం యంత్రాలతోనే కోస్తున్నారు. ఈ క్రమంలో గింజల నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆకులు పూర్తిగా ఎండి రాలిపోయే ప్రారంభ దశలో, కాయలు పూర్తిగా ఎండక ముందే పంటను జాగ్రత్తగా కోయాలి. విత్తన తేమశాతం 14 కంటే ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి. నూర్పిడి చేసే సమయంలో విత్తన కవచం దెబ్బతినకుండా చూడాలి. ఎండబెట్టే సమయంలో నేరుగా సూర్యరశ్మి తగలకుండా జాగ్రత్త పడాలి. లేకపోతే ఆ వేడికి విత్తన పొర చిట్లిపోతుంది. దిగుబడుల నిల్వ సమయంలో చిట్లిన ఈ విత్తన పొర క్రిమికీటకాలకు ఆవాసయోగ్యమై నాణ్యత తగ్గుతుంది. కోత తర్వాత విత్తనాలు, విత్తన సంచులను అయిదు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు నుంచి కింద పడకుండా జాగ్రత్త పడాలి.

మొక్కజొన్న..
తీపి కండెరకం సాగు చేసినప్పుడు గింజ పాలుపోసుకునే దశలో తినడానికి రుచిగానూ, పోషకాలు అధికంగా ఉంటాయి. కండెపై ఉన్న పొరలు ఎండి గింజలో 25-30 శాతం తేమ ఉంటుంది. కండెలను మొక్కల నుంచి వేరు చేసి మూడు నాలుగు రోజులు ఎండలో ఆరబెట్టాలి. కండెల నుంచి గింజలను వేరు చేయటానికి హ్యాండ్ షెల్లర్స్‌ని ఉపయోగించాలి. గింజలో తేమశాతం 10-12 ఉండాలి. పాప్‌కార్న్ కోసం వినియోగించాల్సిన కండెలను 30-35 శాతం తేమ ఉన్నప్పుడే కండెలు కోసి నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెడితే గింజ పగిలి నాణ్యత తగ్గుతుంది. బేబీకార్న్ రకాన్ని బట్టి 43 నుంచి 50 రోజుల తర్వాత కోత మొదలు పెట్టొచ్చు. లేత కండెల కోత ప్రతి రెండు, మూడు రోజులకోసారి చేయాల్సి ఉంటుంది.

రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, అందులో వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని యువతీ యువకులకు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జూనియర్ యూత్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ టీములో ఉన్న విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడే విధంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, డీఈఓ సుధాకర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై రైతులకు శిక్షణ

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి గాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలు నాటుకున్న రైతులకు ఉద్యానశాఖ సమన్వయంతో యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో 28 మండలాలకు చెందిన 1793 మంది రైతులు 3032 ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేశారని, వీరందరికీ మండల స్థాయిలో ఎంపీడీవో, ఎన్ఆర్‌ఈజీఎస్ పీవో/ఏపీవోల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 9 వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఆయా మండలాల ఏపీవోలు, ఈసీఎస్‌లు, గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు రైతులతో మాట్లాడి నిర్ణయించిన తేదీల వారీగా శిక్షణా తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా మామిడి, కొబ్బరి, మునగ, జామ, సీతాఫలం, నేరేడు, చీని, నిమ్మ సాగు చేశారని, ఆయా తోటల్లో తెగుళ్లు-సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, సేంద్రీయ ఎరువులు, అంతర పంటలు, నీటి యాజమాన్యంపై ప్రధానంగా శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వివిధ కేసులకు సంబంధించిన ముగ్గురు నిందితులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా కోకిల అనంతయ్య మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి 10రోజుల జైలు శిక్ష విధించారు. మరో కేసు మనగిరి మహేష్ అనే నిందితుడుడు ఎన్‌జీఓ కాలనీలోని రోడ్డుపై ఆడవారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా.. పదిరోజులు జైలు శిక్ష ఖరారు చేశారు. అదే విధంగా మరో కేసులో కొమ్ము శుభాష్ గోపాల్‌నగర్‌లో ఆడవారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికుల సమాచారం అందివ్వడంతో టూటౌన్ పోలీసులు అతనిపై 294 సెక్షన్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

శనగ సాగుకు శ్రీకారం



ట్రాక్టరుతో శనగ విత్తనం విత్తుతున్న రైతు

దొర్నిపాడు: శనగ పంట వర్షాధారితం కావడం, కేవలం మూడు నెలల్లో చేతికి రావడంతో పాటు సాగు చాలా సులభంగా ఉంటుందని మండలంలోని రైతులు వీటి సాగుపైనే మక్కువ చూపుతున్నారు. ప్రతి ఏటా మండలంలో 4వేల హెక్టార్లలో శనగను సాగు చేస్తారు. కాగా ఈ ఏడాది ఇప్పటికే పొలాల్లో రసాయన ఎరువులను వేసిన తర్వాత వర్షం వస్తే శనగ పంటను వేయాల్సి ఉంది. అయితే వర్షం కురవక పోయినా అదును దాటుతుందని భావించిన రైతులు శనగసాగుకు శ్రీకారం చుట్టారు. మండలానికి 1,000 క్వింటాళ్ల రాయితీ శనగ విత్తనాలు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.8,100 ఉండగా 40 శాతం రాయితీ పోను రైతు రూ.4,860 చెల్లించి రైతులు విత్తనాలు తీసుకున్నారు. ప్రస్తుతం తెల్ల శనగ క్వింటా రూ.13,000, ఎర్ర శనగ క్వింటా రూ.7వేల వరకు ఉన్నాయి. ఇక వర్షంపైనే భారం మోపి రైతులు సాగును మొదలు పెట్టారు. వర్షం కురిస్తే ఎకరానికి 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు





రామాలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సాయిబాబా గుడి సమీపంలో జిలేబీ స్టాల్ పక్కన..

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డీ-1 పరిధి ఎన్‌కే రోడ్డు, బైర్మల్‌స్ట్రీట్, గాంధీచౌక్, బంగారు అంగళ్ల వీధి, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో స్థలాల కొరతతో అంగళ్లు, నివాస ఇళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియక బాటసారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అప్పుడప్పుడు షార్ట్ సర్క్యూట్ టనలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కావడం, వాటి కింద పలువురు చిరు వ్యాపారులు వ్యాపారం నిర్వహిస్తుండటంతో అక్కడికి వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విశాలమైన స్థలాల్లో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, రక్షణ కంచె నిర్మించాలని కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



డీఎస్పీ శ్రీనివాసరావు యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: విద్యార్థులు, ప్రజలు అనునిత్యం పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో డీఎస్పీ బుధవారం నూతన పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన తెలియని అంశాలు తెలుసుకోవచ్చని, పోటీ పరీక్షల్లో రాణించవచ్చని తెలిపారు. అనంతరం పుస్తక దాతలు శివరామకృష్ణ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు తిరుపతయ్యలు డీఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, జయకృష్ణ యాదవ్, పువ్వాడ భాస్కర్, గ్రంథాలయాల నిర్వాహకులు రాకేష్,. డా.షేక్షావలి, శ్రీధర్‌గుప్త, ప్రసాద్, రమణయాదవ్ పాల్గొన్నారు.

28న ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు

నంద్యాల(సెంట్రల్): ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 28 శనివారం జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ పరిధిలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఉదయం 10 గంటలకు సదస్సు ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఉద్యాన సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు, రైతులకు పలు అంశాలపై వివరణాత్మకంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు సదస్సులో పాల్గొని సాగుకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ఆధార్ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు 26న శ్రీరంగాపురం, 27 పెద్దకంబలూరు, 28న ఎల్లావత్తుల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఉంటాయని, ఆయా గ్రామాల ప్రజలు సచివాలయాలకు వెళ్లి మార్పులు, చేర్పులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంప్‌లు

దొర్నిపాడు: మండలంలోని సచివాలయల పరిధిలో మొబైల్ ఆధార్ సేవాకేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న కొండాపురం, డబ్ల్యూ గోవిందిన్నె, 27న బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ కొత్తపల్లె, 28న చాకరాజువేముల, క్రిష్టిపాడు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ అసిస్టెంట్లు సౌజన్య, నాగేశ్వరరావులు ఆయా సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు 9959225800 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం

గోస్పాడు: దసరా పండుగను పురస్కరించుకొని పసురపాడులో ఏర్పాటు చేసిన లలితాదేవి అమ్మవారి విగ్రహానికి బుధవారం నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి, శ్రీ లింగమయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల నిర్వహణలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహానికి 9రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహంగా విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని సమీపంలోని కుంటల్లో నిమజ్జనం చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జగరకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు.

కేసీ కింద పంటలు సాగు చేయొద్దు

నందికొట్కూరు: రబీ సీజన్‌లో కేసీ కెనాల్ కింద రైతులు పంటలను సాగు చేయొద్దని కేసీ కెనాల్ ఏఈ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. బుధవారం పాములపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో రబీ సీజన్‌లో ఏ పంటలు రైతులు వేయకూడదని చెప్పారు. పంటలు వేసి నష్టపోవద్దని హెచ్చరించారు.

డ్రోన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె రహదారిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో ఉచిత డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ బుధవారం తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఇంటర్, ఆపై చదివిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా మూడు నెలల పాటు డ్రోన్ సర్వీస్‌పై శిక్షణ ఇవ్వనునట్లు ఆమె తెలిపారు.

పేదల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాప్రణతి



బోయలకుంట్లలో షుగర్ టెస్ట్ చేస్తున్న వైద్య సిబ్బంది

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఆరోగ్యానికి భరోసా లభించిందని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ సచివాయలం-2 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సుధా ప్రణతి, ఉదయసంధ్యా, హరి, పవన్ పాల్గొని 558 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ మాట్లాడుతూ మండల గ్రామాల్లో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో వేలాది మంది పేదలకు వైద్యం అందిందన్నారు. రూ.వేలు ఖర్చు పెట్టి పట్టణాల్లోని ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోలేని రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష వరంలా మారిందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చాకలి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం విజయవంతం
శిరివెళ్ల: బోయలకుంట్లలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య శిబిరం విజయవంతమయ్యింది. స్పెషలిస్టు వైద్యులు 640 మందిని పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు పోషకాహార పదార్థాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు . కార్యక్రమంలో సర్పంచు జింకల నాగన్న, మండల కో- అప్షన్ మెంబర్ జైలానీబాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అమిత్‌షా ద్వంద్వ వైఖరిని ఖండించాలి



సంఘీభావం తెలుపుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తాం.. చత్తీష్‌గడ్‌లో మాత్రం ప్రైవేటీకరణకు వ్యతిరేకం అంటూ అమీద్‌షా వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఖండించాలని విద్యార్థి సంఘాల నాయకులు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, రఫీ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, ధనుంజయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం తగదన్నారు. నవంబరు 8న కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై విద్యాసంస్థలను బంద్ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాంబాబు, సురేష్, బాలాజీ, షాహిద్, రవి, తేజ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా రక్షణ భేరీ'ని విజయవంతం చేయండి

ఆత్మకూరు: రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన ప్రజారక్షణ భేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, మండల, పట్టణ అధ్యక్షులు నరసింహనాయక్, రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయమీటింగ్‌హాల్‌లో ప్రజా రక్షణ భేరీ పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులు ఉన్నా.. నీటికి కరువేనని, రైతులకు కావాల్సిన సాగు నీటి విడుదలలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లీటర్ పెట్రోల్ రూ.60 నుంచి 120 లకు పెంచిందని రూ.400 గ్యాస్ ధరను రూ.1000కి పెంచడంతో పాటు అన్ని నిత్యవసర సరుకుల ధరలు పెంచిందన్నారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, రామ్‌నాయక్, సురేంద్ర, సుధాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

మహానంది : బండిఆత్మకూరు మండలంలోని మోడల్ స్కూల్‌కు విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైర్లు ఊడిపడిన ఘటనలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం మండలంలోని కడమలకాల్వ, ఈర్నపాడు, శింగవరం గ్రామాల నుంచి బస్సులో విద్యార్థులను ఎక్కించుకొని బండిఆత్మకూరులోని మోడల్ స్కూల్‌కు బస్సు బయలుదేరింది. అందులో దాదాపు 40 మంది విద్యార్థులు ఉన్నారు. శింగవరం నుంచి బండిఆత్మకూరు వెళ్లే మార్గంలో బస్సు ముందుటైర్లు ఊడిపడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు.

కొమ్మా ఉయ్యాలా... కోనా జంపాలా!



జోలపాట వినిపిస్తూ చెల్లిని నిద్రిస్తున్న అక్క

మండలంలో ప్రస్తుతం విత్తన పత్తి క్రాసింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వంటి ప్రాంతాల నుంచి చాలా మంది పనుల కోసం ఇక్కడికి వలసలు వచ్చారు. తల్లిదండ్రులు పొలాల్లో పనులు చేస్తుంటే వారి పిల్లలు చెట్టు కింద సేదతీరుతున్నారు. అందులో ఓ చిన్నారి తన చెల్లిని ఊయలలో నిద్రపుచ్చే పనిలో భాగంగా జోలపాట పాడుతూ.. ఊయల ఊపుతూ కనిపించింది. – దొర్నిపాడు